కథానిక

# సైకిల్ ఖరీదెంత?

బులుసు - జీ - ప్రకాష్

ఎక్కడున్నాడు బుజ్జాయ్!

ఎనిమిదిగంటల రాత్రైనా, దట్టంగా చీకటి పడ్డా, ఎక్కడున్నాడో.

తల్లి బుజ్జాయిని పొరుగింట వెదికింది. శివాలయం చుట్టూ పోయి వెదికింది. బుజ్జాయి అవుపడలేదు. ఆమె గుండె త్వరత్వరగా కొట్టుకోసాగింది.

ఏమైపోయాడో బుజ్జాయ్!

రోజూ సాయంత్రం అయిదు గంటలకల్లా బువ్వ పెట్టమని బలవంతంపెట్టేవాడు. మారాం చేసేవాడు. ఇప్పటి వరకూ బువ్వ తినక, ఇల్లు చూడక ఎక్కడున్నాడో? ఏం చేస్తున్నాడో!

పెరట్లో దిగుడుబావి ఒకటుందన్న సంగతి తల్లికి హఠాత్తుగా స్ఫురితికి వచ్చింది. శరీరం వణికింది.

దిగుడుబావి వద్దకు ఆటకుపోయి, ఆట సందడిలో కాలుజారి... హరహర మహాదేవ్!... అందులో పడి మరణించ లేదు కదా?

దిగుడుబావి పరిసరాలన్నీ కళ్లల్లో కొవ్వొత్తి పెట్టి వెదికింది. ఫలితం శూన్యం.

బుజ్జాయొక్కడే ఆమె కన్న సంతతికల్లా చివరికి నిల్చినవాడు. బుజ్జాయి ముగ్గురన్నల్ని మసిచేసిన మహావీరుడు.

తల్లి మనసు, మనసులో లేదు.

కనబడ్డ పిల్లకాయలందర్నీ "బుజ్జాయిని చూశారా నాయనా?" అని అడిగింది. లేదు లేదన్నదే అందరి నోటా వినవచ్చే జవాబు.

నిస్పృహతో ఇంటికి చేరుకున్నది. అలజడిలో భర్త స్నానానికి నీళ్లు కాచడం మరిచిపోయింది.

ఆమె ధ్యానం అంతా బుజ్జాయి మీదే! బుజ్జాయి ఏడేళ్ళపసివాడు. చక్కగా మాట్లాడగలడు. సాయంత్రంనుండీ అతని కంఠస్వరం వినిపించలేదు.

భర్త రాగానే చెబితే ఆయన తన అశ్రద్ధకి కోప్పడతారు. చెప్పక వీల్లేదు. చెబితే ఆయన బుజ్జాయి జాడను అన్వేషించి తీరుతారు.

భర్తరాకకు తీరని తహతహతో ఎదురు చూస్తున్నది. మంచంక్రింది నుండి మూలుగు, వెక్కి వెక్కి ఏడుస్తున్న ధ్వని.

జాగ్రత్తగా వినింది. ఆ స్వరం బుజ్జాయిదే!

ఊప్పొంగిపోయి మంచం క్రిందికి పరుగెత్తి సన్నగా రోదిస్తున్న బుజ్జాయిని బయటికి మెల్లిగా చేతుల్తోలాగి, మొహంకేసి చూసింది.

బుజ్జాయి బుల్లి బుగ్గల్నిండా కన్నీటి మరకలు! చీరకొంగుతో తుడిచి బుగ్గలం ముద్దు పెట్టుకున్నది.

"ఎందుకురా నాయనా! ఏడుపు? యేం కావాలో చెప్పు!" అని ప్రశ్నించింది.

"మూడుండ్ల సైకిలు! ..." బుజ్జాయి అక్షరాలు వొత్తివొత్తి పలికాడు.

"నాన్న తెస్తారులే" అంది అమ్మ.

"నేను పెద్దవాణ్ణయేకా?" బుజ్జాయి మొహం వేలేశాడు.

"అప్పుడు పెద్దసైకిలే కొంటారు" అని ఆశ పెట్టింది తల్లి.

"మూడుండ్ల సైకిలుకి మూణ్ణెల్లు పట్టింది. రెండుండ్ల సైకిల్ కి రెండేళ్ళు పట్టించేస్తారు నాన్న" అన్నాడు బుజ్జాయి

ఔను! బుజ్జాయి కోరిక నేటిది కాదు. రెండేళ్ళ క్రిందటే ఆకోరిక అతనిలో పుట్టింది. మూడుండ్ల సైకిలు కొనమని అమ్మనడిగాడు. అమ్మ అంత త్వరలో సైకిలు కొనివ్వగలదా? కొనివ్వడానికధమం డెబ్భైఅయిదు రూపాయిలైనా ఉండాలి! అంత పెద్దమొత్తం ఆమెకెక్కణ్ణుంచి వస్తుంది? ఎవరు దయ తలచి యిస్తారు? భర్త యిస్తాడేమోనంటే భర్త చేస్తున్నది క్వారీలో నౌకరీ. రోజుకూలీ రెండు

రూపాయిలు. అది తాము తినడానికే తిన్నగా చాలదు. బుజ్జాయికి సైకిలు కొనివ్వడానికందులో మిగులేముంటుంది?

అంచేత ఆ విషయంలో భర్తను బాధించడానికామె సుతరామూ ఇష్టపడలేదు.

ఎల్లాగోలా నేకొనివ్వాలనినిశ్చయించుకుంది.

భర్త పగలు క్వారీ పనికి కొండవద్దకు పోతాడు. తిరిగీ మళ్ళీ రాత్రి పదిగంటలకింటికి వస్తాడు. ఆలోగా బుజ్జాయిని తీసుకొని, పొలాల్లోకి తానూ కూలీకి వెళ్ళేది. ఆవిధంగా రోజూ సంపాదించిన ఎనిమిదణాల కూలీ అన్యులకంట పడకుండా నిల్వచేస్తూ వచ్చింది. చివరికి అయిదు నెల్లనాటికి సైకిలుకి కావల్సిన మూల్యం డెబ్భై అయిదు రూపాయిలూ పొదుపు చేయగలిగింది.

ఒకనాడు తాను పొదుపు చేసిన మొత్తం భర్తచేతిలో పెట్టి అబ్బాయికి సైకిలు కొనిపెట్టమన్నది. ధనం పుచ్చుకున్నాడు.

"ఇదెక్కడిది? అడిగాడు భర్త.

సంపాదించిన మార్గం చెప్పింది. బుజ్జాయి కోరిక తీర్చాలంది.

"వాడికి సైకిలుకేం కొదవ! అట్లానే కొందాం!" అన్నాడు.

* * *

బుజ్జాయికి నాన్న సైకిలెప్పుడు తెస్తాడా అని ఆత్రుతగావుంది. తెస్తే సైకిలెక్కి వీథంతా చకచకా త్రొక్కేయాలనుకుంటున్నాడు. సూర్యవర్మగారబ్బాయి పొగరు అణిచేద్దామనుకుంటున్నాడు. కానీ ఎంతకీ నాన్న సైకిల్ కొని తేడు కద?

"నాన్న తెస్తారు. మారాంచేయక బువ్వ తిని నిద్రపో నాన్నా!" అని బ్రతిమాలింది తల్లి.

"సైకిలు ముందు, తరువాత భోజనం" పట్టుబట్టాడు బుజ్జాయి.

క్వారీలో పని ముగించుకుని నాయుడు చుట్ట కాల్చుకుంటూ ఇంటికి చేరుకున్నాడు.

"ఇవాళైనా కొనితెచ్చారుకారా సైకిల్?"

అడిగింది భార్య.

"అవునుసుమీ! సైకిలుమాట పనితొందర్లో మరిచేపోయాను. రేపు తప్పక కొనితెస్తాలేరా బుజ్జాయ్!" వాగ్దానం చేశాడు.

"అమ్మా! సైకిలెక్కుతావే?" అడిగాడు తల్లిని ఆకతాయి బుజ్జాయి. తల్లి సామగ్రి సర్దుకుంటూంది.

"నువ్వూ నేను సైకిలెక్కి బజారు కెళ్దామే!" అన్నాడు తిరిగీ.

"వెళ్దాం నాన్నా!" అంది అమ్మ.

"కూరల సంచీ సైకిలుకి తగిలిస్తే గిరగిరా తొక్కుకొచ్చి ఇంటిదగ్గర పారేస్తా చూడు" అన్నాడు.

సైకిలు గిరిగిరాతొక్కకూడదు. జాగ్రత్తగా తొక్కాలిరా నాయనా! లేకపోతే ఎవరైనా ఢీకొనగలరు" హెచ్చరిక చేసింది తల్లి.

"గంట వాయించనూ!" అంటూ బుజ్జాయి కంచు కంచాన్ని గరిటెతో కొట్టి గణగణ మనిపించాడు మచ్చుకోసారి.

"అమ్మోయ్! నా సైకిలుకి దీపంవుండాలే" అని దీపం సంగతి జ్ఞాపకం చేశాడు హఠాత్తుగా జ్ఞప్తికొచ్చి.

"అదికూడా నాన్న కొంటారు లేరా!" అంది తల్లి.

"దీపం వుంటే రాత్రి కూడా షికారు వెళ్తానే! మధ్య తోవలో నాన్న నెక్కించుకుని తిరిగొస్తా" ప్రతాపాలు చెబుతున్నాడు.

"నేను మళ్ళీ తిరిగిపోవాలి, చాలా పనుంది. త్వరగా భోజనం పెట్టు!" నాయుడు బనీను విప్పకుండా, కాళ్లు కడుక్కుని, కంచందగ్గర కూర్చున్నాడు.

"రాత్రికూడా పనేనా?" అడిగింది భార్య.

"తెచ్చావా నాన్నా సైకిల్?" అడిగాడు బుజ్జాయి.

"యజమాని ఇంట్లో శుభకార్యం వుందిట. ఏదో పనులు చేసిపెట్టేందుకు కొన్ని రాత్రుళ్లు వరుసగా ఇంటికి రమ్మన్నాడు. వెళ్లక తీరదు. వేగం వడ్డించు!" అన్నాడు నాయుడు.

"నా సైకిలో?" ఏడుపు ముఖం పెట్టాడు బుజ్జాయి.

"ఏదో పనుందిట్రా! రేపుకొని తెస్తార్లే!" అనునయించింది తల్లి.

"ఇవాళనుంచీ కొన్ని రాత్రుళ్లు నేనిక్కడ పడుకోను. జాగ్రత్తగా వుండాలి సుమీ!" భార్యకి ఉపదేశించాడు నాయుడు.

"మళ్లీ ఏం బండ పనొచ్చింది?" అడిగింది భార్య.

"యజమాని యింట శుభకార్యం వుందని చెప్పాను కానూ! ఆయన సకుటుంబంగా అలహాబాద్ వెళుతున్నాడు. పెళ్లి కొడుకు అక్కడున్నాట్ట. తాను వచ్చే పర్యంతం యింటి కాపలాపని నాదని నొక్కి నొక్కి మరీ చెప్పాడు" అన్నాడు నాయుడు.

"పగలంతా చచ్చిచచ్చి వున్న కూలీల్ని రాత్రన్నా సుఖంగా ఇంటివద్ద నిద్రపోనివ్వకుండా బాధపెడతాడేమండి మీ యజమాని" విస్తుపోయి ప్రశ్నించిందామె.

"బాధకాదు. నమ్మకం. ఆయనకి మనమీద ఎంతో విశ్వాసం కాబట్టే మనని ఇంటి కాపలాకి వినియోగించాడు. అతని నమ్మకాన్ని మనం చెడగొట్టకూడదు" అన్నాడు నాయుడు.

"మంచి నమ్మకమే! మనుషుల్ని పీల్చుకు తినడానికి!" అంది. బుజ్జాయికి కలలో సైకిలు కనబడింది. కళ్ళు నులుముకుంటూ లేచి నాన్న నడిగాడు.

నాయుడు బుజ్జాయి నెత్తుకుని—"అలహాబాదులో మంచి సైకిళ్లు దొరుకుతాయట్రా బాబూ! అయ్యగారిని కొని తెమ్మని డబ్బు చేతికిచ్చాను" అని మళ్లీ వాయిదా వేశాడు.

గుమ్మందిగి వెళ్లిపోయాడు.

నాయుడు యజమాని యింటికి పోలేదు. సమీపంలో వంతెన కడుతున్న కూలీల్తో అక్కడికి పోయాడు. రాత్రంతా కూలీపని చేశాడు. వంతెనపని త్వరగా పూర్తి కావాలని రాత్రి కూలీల్ని హెచ్చు డబ్బిచ్చి నియమించారు కంట్రాక్టర్లు.

గత కొన్ని రాత్రుల్నుండీ నాయుడు వంతెన కూలీల ముఠాలో చేరి రాత్రి కూలీ చేస్తున్నాడు. ఆ సంగతి ఇంటివద్ద భార్యా పిల్లల కెవ్వరికీ తెలీదు. యజమానింట్లో శుభకార్యం అని చెప్పినమాట అబద్ధం. క్వారీ యజమాని అలహాబాద్ వెళ్ళాడన్నది కూడనిజం కాదు. ఆ సాకుచెప్పి రాత్రికూలీ చేస్తున్నాడు నాయుడు.

నాయుడు అర్ధరాత్రి బండరాళ్లు మోస్తున్నాడు. ఇనపదూలాలు ఈడ్చి తెస్తున్నాడు. తట్టల్తో ఇసక అందిస్తున్నాడు. సమ్మెట్లతో కాలిన ఇనప కమ్ముల్ని వంపు తీస్తున్నాడు. నెలమీద పదిరోజులు దాటాయి. తొంభై రూపాయలవరకూ వంతెన కూలీ పనిమీద ఆర్జించి ఇంటికి చేరుకున్నాడు.

నాయుడు అహోరాత్రాల ఎడతెరిపిలేని పరిశ్రమవల్ల నరాల బిగువు సడలిపోయింది. ఊపిరితిత్తులు చెడిపోయాయ్. దగ్గు ప్రారంభించింది. గత మూడురోజుల్నుంచీ అన్నపానాదులు మానుకున్నాడు.

భర్త దుస్థితిచూసి భార్య దిగులుపడింది. ఆమె అతని మంచాన్ని విడిచి ఒక్కక్షణం కూడా బయటికి పోవడంలేదు.

బుజ్జాయికి నాన్న జబ్బు తీవ్రత తెలీదు. తండ్రి ప్రక్కకుచేరి "సైకిలు కొన్నావా నాన్నా?" అని అడిగాడు.

నాయుడు కళ్ళల్లో నీళ్లు తిరిగాయ్. బుజ్జాయిని గుండెమీదికి లాక్కొని ముద్దెట్టుకున్నాడు. వ్రేళ్ళతో జుట్టు సవరించి, భార్య వంక చూశాడు.

"వైద్యుణ్ణి తీసుకురానా?" అడిగిందామె భయతప్తురాలై.

"వద్దు. ఈ మాత్రానికే వైద్యుడెందుకు? అదే నయమవుతుంది" నాయుణ్ణి దగ్గు ఆక్రమించింది.

"పెట్టెలో... వున్నాయ్... తీసుకు రా!" అన్నాడు. ఏమిటి తీసుకురావాలో సరిగ్గా చెప్పలేకపోయాడు.

పెట్టితీసి చూసింది. తొంభైరూపాయలు వున్నాయి. తెచ్చి భర్త చేతిలో పెట్టింది.

"ఇవి తీసికెళ్ళిబుజ్జాయికి సైకిలుకొనియ్యి!" అన్నాడు.

"నేనింత మొత్తం యివ్వలేదే!" భార్య వింతగా అడిగింది.

"అదేవూరో పంపించానన్నావు నాన్నా!" బుజ్జాయన్నాడు.

నాయుడు ముఖంలో ఏడుపు చిహ్నాలవుపించాయ్.

గద్గదికతో—"ఇది నీ సొమ్ము కాదు. నాది! నేను కష్టార్జన చేసింది. నువ్విచ్చిన సొమ్ము అనాడే జూదం ఆడేశాను! వాడికి వెంటనే సైకిలు కొనియ్యి!" అన్నాడు.